క్లుప్తంగా

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ తనిఖీ



స్టేషన్‌లోని రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ అన్బురాజన్

ప్రొద్దుటూరు క్రైం : ఎస్పీ అన్బురాజన్ ప్రొద్దుటూరులోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేసి కేసుల పురోగతిపై అధికారులతో మాట్లాడారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి సీఐ యుగంధర్‌తో చర్చించారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ తుషార్ డూడీ, ఏఎస్పీ ప్రేరణాకుమార్ పాల్గొన్నారు.

నేడు టంగుటూరులో గడప గడపకు మన ప్రభుత్వం

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామంలో శుక్రవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ముడియం గౌతంరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వస్తున్నారని, మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

జగనన్న కాలనీ సందర్శన

ప్రొద్దుటూరు : సీపీఐ నాయకులు గురువారం మండల పరిధిలోని చిన్నశెట్టిపల్లె వద్ద నిర్మిస్తున్న వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్‌ను పరిశీలించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శి జి.చంద్ర మాట్లాడుతూ కాలనీలో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పి.సుబ్బరాయుడు, నాయకులు షరీఫ్, శివారెడ్డి, హరి, ప్రమీల, సురేష్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దప్పిలేశ్వరి ఆలయ వార్షికోత్సవం

బద్వేలు అర్బన్ : బద్వేలు–పోరుమామిళ్ల రహదారిలోని నక్కలగండి సమీపంలో వెలసిన జగజ్జనని దప్పిలేశ్వరి అమ్మవారి ఆలయ 19వ వార్షికోత్సవం గురువారం ఆలయ వ్యవస్థాపకులు, శ్రీసాయివసుధ ట్రస్టు చైర్మన్ సొదరి వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండే అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాల్లో భగవద్గీత ప్రచారకర్త రాధామనోహర్‌దాస్, బి.మఠం వీరబ్రహ్మేంద్రస్వామి వారి మునిమనవడు వీరంబొట్లయ్య, పీఠాధిపతి కుమారుడు గోవిందస్వామి, నాగవిభూది లింగేశ్వరస్వామి ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, సినిమా కో డైరెక్టర్ సెల్వవిరుచిగం పాల్గొన్నారు.

గాలేరు-నగరి నీటిని తరలించండి

బద్వేలు అర్బన్ : కడప సమీపంలోని కొప్పర్తి పారిశ్రామిక ప్రాంతానికి అవసరమైన నీటిని బి.మఠం రిజర్వాయర్ నుంచి కాకుండా గాలేరు–నగరి నుంచి తరలించాలని సీపీఎం సీనియర్ నాయకులు బి.నారాయణ పేర్కొన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొప్పర్తికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న గాలేరు–నగరి ద్వారా నీటిని అందించాలని, లేనిపక్షంలో బుగ్గవంక రిజర్వాయర్ నుండి గాని నీటిని అందించాలని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శివకుమార్, అన్వేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరాలి

రాజుపాళెం : విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని హెచ్‌ఎం తిరుపాల్ పేర్కొన్నారు. మండలంలోని అర్కటవేముల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం వారి సహకారంతో విద్యార్థులకు ఆట వస్తువులు వాలీబాల్, చెస్‌బోర్డు, టెన్నికాయిట్, స్కిప్పింగ్ రోప్ అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సత్యనారాయణ, పీఈటీ అంకారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆంధ్రా సీనియర్ జట్టుకు జిల్లా క్రీడాకారిణులు



ఎస్. రోజా ఎ. శిరీష ఎస్ఆర్. శ్రీచరణి

కడప స్పోర్ట్స్: ఈనెల 29న బరోడాలో నిర్వహించనున్న బీసీసీఐ ఉమన్ వన్డే సీనియర్ విభాగం అంతర్ రాష్ట్రాల క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఆంధ్రా మహిళల జట్టుకు జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లాకు చెందిన ఎస్.ఆర్. శ్రీచరణి (లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్), ఎస్. రోజా (వికెట్ కీపర్), ఎ. శిరీష (ఆల్‌రౌండర్)లు ఆంధ్రా జట్టుకు ఎంపికయ్యారు. వీరి ఎంపిక పట్ల క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్‌ఆర్ డిస్ట్రిక్ట్ (సీఏవైడీ) అధ్యక్షుడు ఎం. భరత్‌రెడ్డి, కార్యదర్శి ఎ. రెడ్డి ప్రసాద్, ఆపరేషన్స్ డైరెక్టర్ ఎస్. ఖాజామైనుద్దీన్‌లు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ప్రజాకవి వేమన జయంతి

మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



విజేతలైన విద్యార్థులతో మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, రెడ్ల సంఘం నాయకులు

ప్రొద్దుటూరు : యోగివేమన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడానికి జీఓ జారీ చేయడం అభినందనీయమని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక రెడ్ల కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రెడ్డి జనసంఘ్ – కడప రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో వేమన జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ వేమన పండితులకు, పామరులకు అర్థమయ్యేలా పద్యాలు చెప్పారని తెలిపారు. ఆప్కాబ్ చైర్ పర్సన్ మల్లేల ఝాన్సీరాణి మాట్లాడుతూ గొప్ప సంఘ సంస్కర్త అని, సమాజంలోని వివక్షను తన పద్యాలతో ఎత్తి చూపారన్నారు. ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, రెడ్ల కల్యాణ మండపం కన్వీనర్ పోరెడ్డి నరసింహారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్నాటి యల్లారెడ్డి, సమన్వయకర్త డాక్టర్ మూలె రామమునిరెడ్డి, జనసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల కొండారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లేల లింగారెడ్డి తదితరులు ప్రజా కవి, యోగి వేమన గొప్పతనాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ప్రొద్దుటూరు రెడ్డి జనసంఘ్ అధ్యక్షుడు జీవీ సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వేమన పద్య పోటీల్లో వైఎస్సార్, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, ఒంగోలు జిల్లాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన విద్యార్థులకు రూ.12వేలు, రూ.9వేలు, రూ.6వేలు చొప్పున పోరెడ్డి సుజాత ఫౌండేషన్ తరఫున పోరెడ్డి నరసింహారెడ్డి బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా జనసంఘ్ అధ్యక్షుడు డాక్టర్ మద్దిక సుబ్బిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి, అనంతపురం, చిత్తూరు, కర్నూలు జిల్లాల జనసంఘ్ అధ్యక్షులు కసిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డితోపాటు మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్ రెడ్డి, డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ముందుగా శివాలయం వీధిలోని యోగివేమన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

■ ప్రజా కవి యోగి వేమన తన పద్యాలతో ప్రజలను ఉత్తేజితులను చేశారని వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.నాగరాజు తెలిపారు. యోగివేమన జయంతి సందర్భంగా గురువారం కళాశాలలో వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ ప్రొఫెసర్ కేవీ రమణయ్య, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైవీఎస్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం యోగివేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. యోగివేమన చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు కాశీప్రసాద్‌రెడ్డి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌వీ రమణారెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. వేమన గొప్పతనాన్ని విద్యార్థులకు వారు వివరించారు. కార్యక్రమంలో ఓబుళరెడ్డి, చిట్టెం రమేష్, సుబ్రహ్మణ్యం, లక్ష్మణ్, ఉపేంద్ర, శ్రీనివాసులు, మునిశేఖర్‌రెడ్డి, సదాశివారెడ్డి పాల్గొన్నారు. రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయంలో ప్రజాకవి యోగివేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. చైతన్య సాంఘిక సేవా సంఘం అధ్యక్షుడు కె.వెంకటరమణయ్య, గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్, గోపాల్ యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, నరసింహాచార్యులు, రవిబాబు, శ్రీనివాసులరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా కవి యోగివేమన

బద్వేలు అర్బన్ : సమాజంలోని లోపాలను తన పద్యరూపంలో తూర్పార బట్టిన సంస్కర్త, ప్రజా కవి యోగివేమన అని రెడ్డి సేవా సంఘం అధ్యక్షుడు గంగసాని సాంబశివారెడ్డి పేర్కొన్నారు. వేమన జయంతి సందర్భంగా గురువారం రెడ్డి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రెడ్డి సేవా సంఘం గౌరవాధ్యక్షులు కె.వి.సుబ్బారెడ్డి, బి.సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులు సి.వి.సుబ్బారెడ్డి, కోశాధికారి జయరామిరెడ్డి, బలిజ సంఘం ఉపాధ్యక్షులు కొంకుల.

వేమనను జాతీయ కవిగా గుర్తించాలి

మైదుకూరు : ప్రజా కవి వేమనకు జాతీయ కవిగా గుర్తించాలని రచయిత, ఉపాధ్యాయుడు తవ్వా ఓబులరెడ్డి కోరారు. గురువారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో వేమన ఫౌండేషన్, తెలుగు సమాజం ఆధ్వర్యంలో వేమన జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వేమన పద్యాల పోటీని నిర్వహించారు. గెలుపొందిన వారికి వేమన ఫౌండేషన్ వారు అందించిన పతకాలను, ధ్రువపత్రాలను, పుస్తకాలను బహుకరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పద్యపఠన పోటీలు

కాశినాయన : మండలంలోని కోడిగుడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వేమన జయంతి సందర్భంగా వేమన ఫౌండేషన్ వారి సహకారంతో విద్యార్థులకు వేమన పద్యపఠన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాంబశివారెడ్డి, ఉపాధ్యాయుడు, కవి సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డిలు యోగివేమన జీవితచరిత్ర, ఆయన రాసిన పద్యాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్, వేమన పద్యాల పుస్తకాలు అందజేశారు.



యోగివేమన చిత్రపటానికి పూలమాల వేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, డీన్ రమణయ్య



మైదుకూరు: పద్యాల పోటీలో గెలుపొందిన విద్యార్థులు



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

జిల్లాస్థాయి చేతిరాత పోటీలు

కలసపాడు : నేషనల్ హ్యాండ్ రైటింగ్ డే, సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా విద్యార్థుల్లో చేతిరాత నైపుణ్యతను, సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈనెల 20, 21వ తేదీల్లో 3వ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్థులకు జిల్లాస్థాయి చేతిరాత పోటీలు నిర్వహించనున్నట్లు ఆలిండియా హ్యాండ్ రైటింగ్ అసోసియేషన్ ఎక్స్‌పర్ట్, అక్షర హ్యాండ్ రైటింగ్ అకాడమి డైరెక్టర్ ఎం.మల్లేశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 20వ తేదీ ఉదయం బద్వేలులో, మధ్యాహ్నం కలసపాడులో, 21వ తేదీ ఉదయం పోరుమామిళ్ళలో, మధ్యాహ్నం నరసాపురంలో, 23వ తేదీ ఉదయం ప్రకాశం జిల్లా కొమరోలులో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల, కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనవచ్చని, పోటీల్లో చక్కని దస్తూరిని రాసిన విద్యార్థులకు తరగతుల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో మెరిట్ సర్టిఫికెట్లు, మెడల్స్, మెమొంటోలను ప్రముఖులు, విద్యావేత్తల చేతులమీదుగా బహుమతులను అందజేస్తారన్నారు. వివరాలకు 7893101123 ఈ నెంబరును సంప్రదించాలని కోరారు.

కానిస్టేబుల్ నమూనా పరీక్ష విజయవంతం

మైదుకూరు : భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో గురువారం మైదుకూరులో నిర్వహించిన కానిస్టేబుల్ నమూనా పరీక్ష విజయవంతమైంది. ఈ పరీక్ష కానిస్టేబుల్ ఉద్యోగానికి సన్నద్ధం అయ్యే అభ్యర్థులకు ఉపయుక్తంగా ఉంటుందని డీవైఎఫ్‌ఐ నాయకులు రెబ్బా నరసింహులు, విజయభాస్కర్ తెలిపారు.

రహదారి భద్రత అందరి బాధ్యత



మాట్లాడుతున్న ఎంవీఐ నారాయణనాయక్



మాట్లాడుతున్న ఎంవీఐ శేఖర్ రావు

ప్రొద్దుటూరు క్రైం : రహదారి భద్రత అందరి బాధ్యత అని సీనియర్ ఎంవీఐ నారాయణనాయక్ తెలిపారు. స్థానిక పాలిటెక్నిక్ కాలేజీలో గురువారం జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన తర్వాతనే డ్రైవింగ్ లైసెన్స్ పొంది వాహనాలను నడపాలన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేయడం శ్రేయస్కరం కాదని, అది చాలా ప్రమాదకరమని తెలిపారు. అమ్మాయిలు కూడా స్కూటీలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐ శ్రీనివాసరెడ్డి, త్రీ టౌన్ ఎస్ఐ కృష్ణంరాజునాయక్, సీఎస్‌ఈ ఎం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మైదుకూరులో...

మైదుకూరు : స్వచ్ఛత పక్వాడ- 2023 కార్యక్రమంలో భాగంగా మేధా డిఫెన్స్ అకాడమీ కేంద్రంలో 34వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా బద్వేలు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ రావు మాట్లాడుతూ సామాజిక బాధ్యతను విద్యార్థుల్లో అభివృద్ధి చేసినప్పుడే సురక్షితమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. 20 ఏళ్లలోపు వయసు కలిగిన యువత సమాజంలో ఎక్కువగా ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. వారికి సరైన అవగాహన కల్పించడం కోసం సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మైదుకూరు సబ్ ఇన్‌స్పెక్టర్ మద్దిలేటి, మేధా విద్యా సంస్థల చైర్మన్ చెన్నంశెట్టి నరసింహులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

ప్రొద్దుటూరు : స్థానిక బైపాస్ రోడ్డులోని లలిత త్రిపుర సుందరీదేవి ఆలయం వద్ద నివసిస్తున్న రాటాల రాములమ్మ (75) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణరావు.. ఆమె మృతదేహానికి హిందూ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో శివసాయినాథ్, సుభాన్, సుబ్బయ్య, తిరుపాల్, సాల్మన్, రఫి, మహ్మద్ పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

బద్వేలు అర్బన్ : ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి వారిని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఓబులేసు, చేతివృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ నాగరాజులు పేర్కొన్నారు. గురువారం స్థానిక మార్కెట్‌యార్డు వద్ద నిర్వహించిన ఆటో కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణంలోని అన్ని ప్రధాన రహదారులలో ఆటోస్టాండ్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు నరసింహులు, దస్తగిరి, డేవిడ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌పై భార్య ఫిర్యాదు

కడప అర్బన్: కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో మరియాపురంలో నివాసం వుంటూ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జోహన్నెస్‌పై అతని భార్య అరుణ చేసిన ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి సీఐ ఉలసయ్య ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు. జోహాన్నెస్‌తో అరుణకు వివాహమై 20 సంవత్సరాలైంది. వీరికి నలుగురు సంతానం. ఇటీవల కడపలో రెవెన్యూ అధికారి ఫిర్యాదు మేరకు జోహాన్నెస్ ఓ కేసులో నిందితుడిగా వుండి, జైలుకు వెళ్లి వచ్చాడు. ప్రస్తుతం అతను సస్పెన్షన్‌లో ఉన్నాడు. కాగా కొన్ని రోజుల నుంచి భార్యను వేధించసాగాడు. దీంతో భార్య అతని వేధింపులకు తట్టుకోలేక పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



తంబళ్ళగొందిలో పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

అట్లూరు : పేద, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మండల పరిధిలోని తంబళ్ళగొంది సచివాలయ పరిధిలోని యర్రబల్లి, యర్రబల్లి ఎస్సీ కాలనీ, బీబీసాహెబ్‌పేట, తంబళ్ళగొంది, తంబళ్ళగొంది ఎస్సీకాలనీలలో ఆమె గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబాలకు ఏయే పథకాల ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో సంబంధిత పత్రాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇంతవరకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెనుకబడిన వారి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంఘం చైర్మన్ రొండా మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి, తంబళ్ళగొంది ఉప సర్పంచ్ సుబ్బిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పోతిరెడ్డి రెడ్డెయ్య, పొన్నవోలు బ్రహ్మానందరెడ్డి, పెంచల్‌రెడ్డి, గంగిరెడ్డి, మల్లు సుబ్బారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మీనరసారెడ్డి, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు : పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం–1 సచివాలయం పరిధిలోని ప్రధాన రహదారి, రాఘవేంద్రనగర్, ఎస్టీకాలనీ, మహబూబ్‌నగర్–1 వీధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ పాల్గొని సంక్షేమ పథకాలు, ఒక్కో కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాలప్రసాద్, ఉప మండలాధ్యక్షుడు సి.బాషా, చెన్నురాజశేఖర్, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీలు కలవకూరి రమణ, చెంద్రాయుడు, మహబూబ్‌పీరా, ఉప సర్పంచ్ రుద్రవరం ప్రసాద్, నాయకులు కళ్యాణ్ చక్రవర్తి, మాలకొండయ్య, చాపాటి సాయినారాయణరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు

చాపాడు : మండలంలోని అయ్యవారిపల్లె, లక్ష్మీపేట గ్రామ సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ శిబిరం సేవలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి శ్రీధర్ నాయుడు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఆధార్ కార్డుల్లో చిన్న పిల్లలతో పాటు అన్ని వయస్సుల వారు మార్పులు, చేర్పులు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఆధార్ నమోదు ప్రక్రియను నిర్వహిస్తారన్నారు. అయ్యవారిపల్లె, లక్ష్మీపేట పంచాయతీ పరిసర గ్రామాల్లోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆయుష్మాన్ భారత్ నమోదు..

మండల వ్యాప్తంగా 15 గ్రామ సచివాలయాల పరిధిలో గ్రామ వలంటీర్లు ఆయుష్మాన్ భారత్ నమోదు ప్రక్రియను వేగవంతంగా చేయాలని ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు తెలిపారు. గ్రామ సచివాలయాల పరిధిలో గ్రామ వలంటీర్లు తమకు కేటాయించిన లబ్ధిదారుల వివరాలను ఆయుష్మాన్ భారత్‌లో నమోదు చేయాలన్నారు. ఆయా గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామ కార్యదర్శులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే జిల్లాలో చాపాడు మండలం నాలుగో స్థానంలో ఉందని, మొదటి స్థానానికి తీసుకొచ్చేలా నమోదు ప్రక్రియ చేపట్టాలని ఎంపీడీఓ ఆదేశించారు.

పంట నమోదు చేయించుకోవాలి



పంట నమోదుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోపవరం : రబీలో సాగైన పంటలకు పంట నమోదు చేయించుకోవాలని బ్రాహ్మణపల్లె రైతుభరోసా కేంద్రంలో గురువారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి మోశ, ఎంఐఏఓ జయసుబ్బారెడ్డి, వీఏఏ సతీష్ కుమార్‌ల ఆధ్వర్యంలో రైతులకు పంట నమోదుపై అవగాహన కల్పించారు. ఇప్పటికే సాగైన పంటలను చాలా వరకు పంట నమోదు చేశామని, ఇంకా పంట నమోదు చేయించుకోని రైతులు ఆర్బీకేను సంప్రదించాలన్నారు. అలాగే డ్రిప్‌లు, సింగర్లు సబ్సిడీతో రైతులకు అందజేయనున్నట్లు వారు తెలిపారు. అవసరమైన రైతులు ఆర్బీకేలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్‌లు, 55 శాతం సబ్సిడీతో సింగర్లు రైతులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం రైతులు ఆర్బీకేను సంప్రదించాలని కోరారు.

త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీనివాసులరెడ్డి

రాజుపాళెం : గ్రామాల్లో త్వరితగతిన ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీనివాసులరెడ్డి అన్నారు. రాజుపాళెంలోని ఎంపీడీఓ సభా భవనంలో గురువారం సాయంత్రం మండల, గ్రామ, సచివాలయ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి 562 ఇళ్లు మంజూరయ్యాయని, అందులో 182 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. మిగతా లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అధికారులంతా సమిష్టిగా పనిచేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పక్కా గృహాల నిర్మాణం వేగవంతం చేయాలని చెప్పారు. తరచుగా లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలను వేగవంతం చేయాలని, బిల్లులు కూడా త్వరితగతిన అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాఘవేంద్ర కుమార్, తహసీల్దార్ ఇందిరారాణి, ఈఓపీఆర్డీ షాకీర్ ఆలీఖాన్, హౌసింగ్ ఏఈ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలి




మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్

వైవీయూ : విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవడంతో పాటు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సి పాల్ డా. జి. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. గురు వారం కడప ఆర్ట్స్ కళాశాలలో రీసెంట్ ట్రెండ్స్ ఇన్ జెనిటిక్స్ అన్న అంశంపై సైన్స్ అకాడమీ లెక్చర్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అందిపుచ్చు కుంటూ పరిశోధనల్లో ముందుకు సాగాలని సూచించారు. వర్క్‌షాపు కన్వీనర్ ఆచార్య ఎస్.బి. రామచంద్ర మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో సైన్స్‌పట్ల అవగాహన పెంపొందించేందుకు సైన్స్ అకాడమీ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నా రు. రీసోర్స్ పర్సన్ టి. శివానందప్ప, డా. ఎం. సుబ్బారెడ్డి , వర్క్‌షాపు సమన్వయకర్త డా. పి. కల్పన మాట్లాడారు. కార్యక్రమంలో వైవీయూ అధ్యాపకులు డా. ఎస్. వెంకటరామిరెడ్డి, డా. అనుప్రసన్న, కళాశాల అధ్యాపకులు డా. రవిశేఖర్, డా. వై. సావిత్రి, డా. నరసింహారావు, డా. శ్రీనీత, డా. రాజేశ్వరి, బయపురెడ్డి, కృష్ణారెడ్డి, సురేష్, రాజశేఖరరెడ్డి, నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అందరికి లబ్ధి చేయాలన్నదే ప్రభుత్వ ఆశయం

గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



ఇంటి పట్టాలు అందుకున్న వారితో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాల వల్ల లబ్ధి పొందని కుటుంబం లేదు.. అభివృద్ధి చెందని గ్రామం లేదు.. ఇదే విషయం మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నిరూపితమవుతోంది. రెండు రోజులుగా మండలంలోని వనిపెంటలో నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి వనిపెంటలోని ఏ గడపకు వెళ్లినా 'సార్ ! మాకు అమ్మ ఒడి కింద సాయం అందుతోందనో.. రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందుతోందనో.. డ్వాక్రా మహిళకు సీఎం వైఎస్ జగన్ ఇస్తున్న వడ్డీ మాఫీ వర్తించిందనో.. చెప్పేవాళ్లే తప్ప, మాకేమీ అందలేదు అని చెప్పే వారు లేరంటే అతిశయోక్తి కాదు. రెండో రోజు గురువారం ఎమ్మెల్యే వనిపెంటలోని హౌసింగ్ కాలనీ, ఎస్సీ కాలనీ, వడ్డెర కాలనీ, బీసీ కాలనీల్లో ఇంటింటికి తిరిగి వివిధ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందించిన బుక్‌లెట్ ఇవ్వగానే, మాకు అన్నీ అందుతున్నాయి సార్, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాము' అంటూ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి వద్ద సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరికీ పథకాల లబ్ధి చేయాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి అంటూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారం

వనిపెంటలోని హౌసింగ్ కాలనీ వాసులు తమకు స్మశానానికి స్థలం కావాలని అడగగా, ఎమ్మెల్యే స్పందించి వెంటనే స్థలాన్ని కేటాయించాలని అక్కడే ఉన్న తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డికి సూచించారు. ఎస్సీ కాలనీలోని పిల్లలకు పాఠశాల ఏర్పాటు చేయాలని, అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనం కావాలని అడిగారు. పాఠశాలను ఏర్పాటు చేయాలని ఎంఈఓ పద్మలతకు, అంగన్‌వాడీ కేంద్రం భవనానికి అంచనాలు వేయాల్సిందిగా ఏఈ మధుసూదన్‌బాబుకు ఎమ్మెల్యే సూచించారు. వడ్డెర కాలనీలో డ్రైనేజీలు ఏర్పాటుకు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వనిపెంట సర్పంచ్ ఆదాం గౌస్ లాజం, ఎంపీటీసీ ఇర్షాద్, జెడ్పీటీసీ వెంకట సుబ్బారెడ్డి, ఎంపీపీ థామస్, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు

సమస్యలను ఎక్కడికక్కడ స్థానికంగా పరిష్కరించి, ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పరిచిన సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలనిస్తోంది. మైదుకూరులో సొంత ఇల్లు లేని పలువురు ఇంటి స్థలం కోసం గత నవంబర్ 24న ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి విన్నవించుకున్నారు. గడపగడపకు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే స్థానిక 18వ వార్డులో పర్యటించారు. వార్డులోని రాజీవ్ గాంధీ నగర్ ప్రాంతంలోని 24 మంది పేదలు ఇంటి స్థలం కావాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. ఆయన ఆదేశాలతో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇల్లులేని పేదల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. సచివాలయాల ద్వారా 90 రోజుల్లోపు సమస్యను పరిష్కరించాలనే సీఎం ఆదేశాల మేరకు వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయగా, ఎమ్మెల్యే వాటిని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, కమిషనర్ రాముడు, వైస్ ఎంపీపీ ఊటుకూరు రఘురామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు షరీఫ్, భరత్‌కుమార్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు చౌదరివారిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం

బ్రహ్మంగారిమఠం : మండలంలోని చౌదరివారిపల్లె గ్రామ పంచాయతీలో శుక్రవారం ఉదయం 6 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యాక్రమం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షులు సి.వీరనారాయణరెడ్డి తెలిపారు. చౌదరివారిపల్లె పంచాయతీలోని గుండాపురం, నరసన్నపల్లె, చౌదరివారిపల్లె హరిజనవాడ గ్రామాల్లో నిర్వహించే ఈ కార్యాక్రమంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరవుతారన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని ఎంపీపీ కోరారు.